గురువారం 25, ఏప్రిల్ 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## టెన్త్ విద్యార్థులకు గుడ్ న్యూస్.. ఈ నెల 30నే రిజల్ట్స్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 24:** ఈ నెల 30వ తేదీన పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. ఇంటర్మీడియట్ ఫలితాల విడుదల సందర్భంగా ఈ విషయాన్ని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. మూల్యాంకనం పూర్తయిందని, డీకోడింగ్ ప్రక్రియ కూడా చివరి దశకు చేరుకుందన్నారు. 30వ తేదీన ఉదయం 11 గంటలకు పది ఫలితాలు విడుదల కానున్నాయి. ఇక ఈ ఏడాది 5,08,385 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు 2,676 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ ఎగ్జామ్స్ నిర్వహించిన సంగతి తెలిసిందే.



### పంద్రాగస్టులోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా : హరీష్‌రావు



### సంపద పంచుతారంటూ మోదీ ఆరోపణలు.. రాహుల్ క్లారిటీ...



## సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలవబోతోంది..

## కేంద్రంలో కాంగ్రెస్ రాబోతోంది.. సీఎం రేవంత్‌రెడ్డి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 24:** సికింద్రాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని.. కేంద్రంలోనూ తమ ప్రభుత్వమే రాబోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆనాడు దత్తాత్రేయని ఓడించి.. అంజన్ కుమార్ యాదవ్ సికింద్రాబాద్‌లో మూడు రంగుల జెండా ఎగరేశారు. అప్పుడు కేంద్రంలో సోనియమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఆనాటి రోజులను పునరావృతం చేయడానికి దానం నాగేందర్ 3 రంగుల జెండా ఎగరేయబోతున్నారని అన్నారు. దానం గెలిచి కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యత నిర్వహించబోతున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు గెలిచి కేంద్ర మంత్రులు అయినా హైదరాబాద్‌కు చేసిందేమి లేదన్నారు. వరదలు వచ్చి హైదరాబాద్ అతలాకుతలమైతే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నగరానికి చిల్లిగవ్వ తేలేదన్నారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మతాలపేరుతో చిచ్చుపెట్టి కేంద్రంలోని మోదీ సర్కార్ ఓట్లు దండుకుంటోందని ధ్వజమెత్తారు. బీఆర్ ఎస్ అభ్యర్థి పద్మారావు మంచోడే కానీ.. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఆయన మునిగినట్టేనని అన్నారు. . అతని పరువు తీయడానికే సికింద్రాబాద్ అభ్యర్థిగా నిలబెట్టారని అన్నారు. రు. సికింద్రాబాద్ టికెట్‌ను బీజేపీ తాకట్టు పెట్టారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం చేసే బాధ్యత మాదని అన్నారు.


## పార్లమెంట్ ఎన్నికల్లో బలం ఇస్తే.. కాంగ్రెస్ మెడలు వంచుతం

## మిర్యాలగూడ ప్రచారంలో కేసీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, మిర్యాలగూడ, ఏప్రిల్ 24:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి బలం ఇస్తేనే.. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి హామీలను అమలు చేయిస్తామని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. బస్‌యాత్రలో భాగంగా బుధవారం మిర్యాలగూడలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తమంటున్నరు. కేసీఆర్‌ను తీసుకుపోయి చర్లపల్లి జైలులో వేస్తమంటరు. జైళ్లకు.. తోకమట్టకు కేసీఆర్ భయపడుతడా? అట్ల భయపడితే తెలంగాణ వచ్చేదా? 15 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణను తెచ్చాం. ఈ రోజు నిన్ను జైలులో వేస్తాం. నీ పేగులు తీసి మెడలో వేసుకుంటం. నీ గుడ్లుపీకి గోళీలు ఆడుతం.. ఇదా ఓ ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన భాషా. మిమ్మల్ని పండపెట్టి తొక్కుతం ఇదే భాషనా ? ఓ ముఖ్యమంత్రి నుంచి ఆశించేది ఇదేనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. '15 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణ సాధించిన వ్యక్తి.. 10 సంవత్సరాలు తెలంగాణను ప్రజలను కులం, మతం, వర్గమనే బేధం లేకుండా అన్నివర్గాల ప్రజలను బ్రహ్మాండంగా చేసిన వ్యక్తిని పట్టుకొని.. నీ గుడ్లు పీకుతా.. నీ పేగులు మెడలో వేసుకుంటా. నిన్ను జైలులో వేస్తా ఇదా మాట్లాడాల్సిన భాషా. ప్రజలు ఆలోచన చేయాలి. అన్నీ అబద్ధాలు చెబుతూ, శ్వేతపత్రాలు విడుదల చేసి.. బోగస్ మాటలు చెబుతూ.. ఇచ్చిన హామీలను ఎగవెట్టి.. ఆరు హామీలకు పంగనామం పెట్టి.. ఈ రోజులు చేతులు ఎత్తేసి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఆరోపించారు

## అంబర్ పేట ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, ఏప్రిల్ 24:** అంబర్ పేట ప్రధాన దారిలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ గుడిలో బుధవారం శాస్త్రోక్తంగా ముత్యాలమ్మ విగ్రహ శిఖర పున: ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచే పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు నరసింహ,ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ మరో మూడు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు..

### ఖమ్మం , కరీంనగర్, హైదరాబాద్ టికెట్ ఎవరికంటే..?



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 24:** తెలంగాణలో మరో మూడు పార్లమెంట్ స్థానాలకు తెలంగాణ అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా రామ సహాయం రాఘురాంరెడ్డి పేరును ఖరారు చేసింది. కరీంనగర్ టికెట్‌ను వెలిచాల రాజేందర్‌రావు కేటాయించింది. ఇక హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా మహమ్మద్ సమీర్‌ను పేరును ప్రకటించింది. అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. ఇప్పటి వరకు 14 సీట్లకు అభ్యర్థులను కేటాయించిన విషయం తెలిసిందే. తాజాగా పెండింగ్‌లో ఉన్న మూడు స్థానాలకు సైతం అభ్యర్థులను ఖరారు చేసింది. ఆయా స్థానాల్లో తమకు కావాలంటే తమకు కావాలని కీలక నేతలు పట్టుబట్టడంతో అభ్యర్థుల ప్రకటన ఆలస్యంగా జరిగినట్లు తెలుస్తున్నది.

## సీనియర్ కాంగ్రెస్ నేత 'గౌస్ భాయ్ 'కు కన్నీటి వీడ్కోలు..



గౌస్ బాయ్ పార్థీవ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట , ఏప్రిల్ 24:** కాంగ్రెస్ సీనియర్ మహ్మద్ గౌస్ కు బుధవారం అంబర్ పేట కన్నీటి వీడ్కోలు పలికింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ , కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు తో పాటు కాంగ్రెస్ నాయకులు , వివిధ పార్టీల నాయకులు, మిత్రులు బాగ్ అంబర్ పేటలోని మహ్మద్ గౌస్ ఇంటికి తరలివచ్చి చివరిసారిగా ఆయన పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. గత కొంత కాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న మహ్మద్ గౌస్ కాచిగూడ సీసీ షరాఫ్ దవాఖానాలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. కాగా బుధవారం మధ్యాహ్నం బాగ్ అంబర్ పేట బడీ మజీదులో ప్రత్యేక నమాజు అనంతరం అక్కడి నుంచి అంతిమ యాత్ర నిర్వహించి అంబర్ పేట కబ్రిస్తాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు.



మహ్మద్ గౌస్ పార్థీవ దేహం వద్ద నివాళులర్పిస్తున్న వీహెచ్, శంభుల శ్రీకాంత్ తదితరులు

## క్షణికావేశంలో విద్యార్థుల తెగింపు..తల్లిదండ్రులకు కడుపుకోత



**ఇయ్యాల్టి న్యూస్, క్రైమ్, ఏప్రిల్ 24:** అల్లారుముద్దుగా పెంచుకుని.. పెరిగి పెద్ద చేసుకుని ఉన్నతస్థాయి చదువులు చదివిపిస్తే, వారు మాత్రం తల్లిదండ్రుల దుఖాన్ని, బాధను చూడకుండా కడుపుకోతను మిగులుస్తున్నారు. తమ పిల్లలు మంచిగా చదువుకుని తమను ఎంతో సంతోషంగా చూసుకుంటారని అనుకుంటే మధ్యలోనే తల్లిదండ్రులను విడిచిపోయి శోకసంద్రంలో ముంచుతున్నారు. తాజాగా తెలంగాణలో ఇంటర్ లో ఫెయిల్ అయినందుకు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మెదక్ జిల్లాలో ఓ విద్యార్థిని సూసైడ్ చేసుకుంది. ఇంటర్ లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. శేరిపల్లి సమీపంలో రమ్య అనే విద్యార్థిని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మరోవైపు.. మంచిర్యాల జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. దొరగారి పల్లి గ్రామానికి చెందిన ఘటిక తేజస్విని అనే విద్యార్థిని.. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలో ఫెయిల్ అయిన కారణంగా మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తాండూరు మండలం అచలాపూర్ లో సాత్విక్ (15) అనే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## కవిత బెయిల్ పిటిషన్...తీర్పు రిజర్వ్




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , ఏప్రిల్ 24: మద్యం పాలసీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌లపై తీర్పును ఢిల్లీలోని రౌస్ అవెన్యూ స్పెషల్ కోర్టు రిజర్వ్ చేసింది. సీబీఐ మద్యం కేసులో కవిత బెయిల్‌పై తీర్పును మే 2 తేదీన... ఈడీ కేసులో తీర్పును మే 6వ తేదీన ఇవ్వనుంది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ సంస్థలు కోర్టు ఎదుట సుదీర్ఘ వాదనలు వినిపించాయి. ఈడీ తరపు న్యాయవాది దాదాపు రెండు గంటల పాటు బెయిల్ ఇవ్వవద్దని వాదనలు వినిపించారు. ఏప్రిల్ 26వ తేదీలోగా కవిత తరఫు న్యాయవాదులు రిజాయిండర్ దాఖలు చేయనున్నారు. కవితను అక్రమంగా అరెస్ట్ చేశారనే వాదనలో పస లేదని, మద్యం కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని విచారణ సంస్థలు కోర్టులో వాదనలు వినిపించాయి.

## ప్రమాదానికి గురైన కేసీఆర్ కాన్వాయ్.. తప్పిన పెను ప్రమాదం..



**ఇయ్యాల్టి న్యూస్, నల్గొండ , ఏప్రిల్ 24:** కేసీఆర్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. పలు వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. తృటిలో పెను ప్రమాదం తప్పింది. నల్గొండ జిల్లా లోక్ సభ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న కేసీఆర్ కాన్వాయ్?లో ప్రమాదం చోటు చేసుకుంది. కాన్వాయ్?లో ప్రయాణిస్తున్న సమయంలో ఒక వాహనానికి మరొకటి ఢీకొని అలా 8 వాహనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. కాన్వాయ్ లో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కేసీఆర్ సహా అందరూ సురక్షితంగా బయటపడ్డారు. నల్లగొండ జిల్లా వేముల పల్లి వద్ద కేసీఆర్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డ కేసీఆర్ సుదీర్ఘ విరామం తరువాత తిరిగి ప్రజాక్షేత్రంలోని వచ్చారు. గతంలో కరీంనగర్?లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్న కేసీఆర్ ప్రస్తుతం లోక్ సభ ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగానే బస్సుయాత్రను చేపట్టారు. అయితే మిర్యాలగూడ బహిరంగసభలో పాల్గొనేందుకు బయలుదేరిన కేసీఆర్ కాన్వాయ్ కు వేముల పల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది.

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

గురువారం 25, ఏప్రిల్ 2024



## మే 24 నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఏప్రిల్ 24:** తెలంగాణలో మే 24 నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ ఒకటో తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ రిలీజ్ చేసింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు సెంకడియర్ పరీక్షలు జరగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో స్వీకరించనున్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించి కూడా ఇదే సమయంలో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం ఒక్కో పేపర్‌కు రూ. 100, రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ. 600 చెల్లించాల్సి ఉంటుంది.

.

## పూర్తిగా మహిళల కోసమే ఈ సభ ఏర్పాటు చేశాం: చంద్రబాబు



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, ఏప్రిల్ 24:** టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం శ్రీకాకుళం నియోజక వర్గం మహిళలతో మహిళా శక్తి సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మహిళా సాధికారత, గతంలో తాము మహిళల కోసం ఏం చేశాము, వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఏం చేస్తాము అనే అంశాలను వివరించారు. ఈ సభపై చంద్రబాబు ఆసక్తికర ట్వీట్ చేశారు. "నేడు శ్రీకాకుళంలో 'మహిళా శక్తి'తో ముఖాముఖి మాట్లాడాను. ఈ సభ ప్రత్యేకత ఏంటో తెలుసా...? ఈ సభకు పూర్తిగా మహిళలే హాజరయ్యేలా, మహిళల కోసమే ఏర్పాటు చేశాం. మహిళలకు అవకాశాలు ఇస్తే రాణిస్తారని నేను గట్టిగా నమ్ముతాను. రాజకీయ ప్రక్రియల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపొందించడంపై రాజకీయ పార్టీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వారి సమస్యలు పంచుకునేందుకు, వారి అవసరాలపై భరోసా ఇచ్చేందుకు అవకాశం కల్పించాలి" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## 22చంద్రబాబుకు ఓటేస్తే పథకాలకు ముగింపే: సీఎం జగన్




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, ఏప్రిల్ 24:** సీఎం జగన్ బుధవారం టెక్కలి నియోజకవర్గం అక్కవరంలో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సాయంత్రం వేళ అక్కవరంలో సిక్కోలు సింహాలు కనిపిస్తున్నాయని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పేద ప్రజల గుండె చప్పుళ్లే ఈ సిద్ధం సభలు అని అభివర్ణించారు. ఈసారి 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు గెలవాల్సిందే అని సమర శంఖం పూరించారు. డబుల్ సెంచరీ సాధించేందుకు మీరంతా సిద్ధమా? అని ప్రశ్నించారు. రేపటి ఎన్నికల్లో జగన్ కు ఓటేస్తే పథకాలన్నీ కొనసాగుతాయి... చంద్రబాబుకు ఓటేస్తే పథకాలకు ముంగిపేనని అన్నారు. ఈ ఐదేళ్లలో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవండి... కూటమి మోసాలకు చెంప చెళ్లుమనిపించేలా ఓటుతో జవాబు చెప్పండి అని సీఎం జగన్ పిలుపునిచ్చారు. "ఎన్నికలు కాగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసే చంద్రబాబు సంస్కృతిని గతంలో చూశాం. కానీ మేనిఫెస్టోను ఒక బైబిల్ గా, ఒక ఖురాన్ గా, ఒక భగవద్గీతగా భావిస్తూ ఏవైతే హామీలు ఇచ్చామో అందులో 99 శాతం నెరవేర్చామని సగర్వంగా చెబుతున్నానని అన్నారు..

## ఎన్నికల ర్యాలీలో పవన్ కల్యాణ్ డ్యాన్స్.. వీడియో వైరల్!



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, ఏప్రిల్ 24:** ఎన్నికల నామినేషన్ ర్యాలీలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ డ్యాన్స్ చేశారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేనాని డ్యాన్స్ చేసి జనసైనికుల ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక పవన్ మంగళవారం పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కాగా, టీడీపీ, బీజేపీతో పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ సీట్లు దక్కిన సంగతి తెలిసిందే.

## వాళ్ల పేర్లు నేను చెబుతా.. మీరు చెబుతారా..

### కేసీఆర్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఛాలెంజ్..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఏప్రిల్ 24:** ఓ టీవీ ఛానెల్ వేదికగా మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తాము అర్భకులం కాదు..అర్జునులమై పోరాడాం అంటూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అమలు చేసే హామీలే ఇచ్చింది అంటూ కోమటిరెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 12 ఎంపీ స్థానాలు వస్తాయి.. బీఆర్ఎస్‌కు 8 స్థానాలు వస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా.. కేసీఆర్ ఏం చేస్తారో చెప్పాలి?.. అంటూ మంత్రి కోమటిరెడ్డి సవాల్ చేశారు.

## వలస పక్షులకు ఓటేస్తే.. గెలిచినా కనబడరు : కేటీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, మేడ్చెల్ మల్కాజ్ గిరి , ఏప్రిల్ 24:** మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా కేటీఆర్ రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలో రేవంత్ రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలిచారని కేటీఆర్ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంతో ఇచ్చింది. పీసీసీ, సీఎం పదవులు రావటానికి మల్కాజ్‌గిరి ప్రజలే కారణం. అలాంటి రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు ఏం చేయలేదు. పార్లమెంట్‌లో పత్తా లేకుండా పోయిండు. ప్రజలకు కష్టం వస్తే కనబడకుండా పోయిండు. ఈ వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మీకు కనబడరు. మీకు 24 గంటలు అందుబాటులో ఉండే రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించండి అని ప్రజలను కేటీఆర్ కోరారు.

## పంద్రాగస్టులోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా : హరీష్‌రావు




**ఇయ్యాల్టి న్యూస్, సంగారెడ్డి , ఏప్రిల్ 24:** పంద్రాగస్టు లోగా రుణమాఫీ చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, రుణమాఫీ చేయకపోతే మీరు సీఎం పదవికి రాజీనామా చేస్తారా..?' అని బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సంగారెడ్డిలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్ లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించిన హరీష్ రావు.. 'సీఎం సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా. అధికార పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చేసే బాధ్యత ప్రతిపక్షంగా మాపై ఉంది' అన్నారు. 'ఎల్లుండి అసెంబ్లీ ముందు అమరవీరుల స్తూపం దగ్గరికి నేను వస్తా. ఆగస్టు 15 లోపు మీరు ఇచ్చిన అన్ని గ్యారెంటీలు అమలు చేస్తానని ప్రమాణం చెయ్యి. ఆగస్టు 15 లోపు పూర్తిగా రుణమాఫీ చెయ్యాలి. ఒకవేళ రుణమాఫీ చేస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. మళ్ళీ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేయను. రుణమాఫీ చెయ్యక పోతే సీఎం పదవికి రాజీనామా చేస్తారా..?' అని హరీశ్‌రావు సీఎంను ప్రశ్నించారు. 'నాకు పదవి కంటే తెలంగాణ ప్రజల సంక్షేమమే ముఖ్యం. గతంలో కొడంగల్‌లో ఓడిపోతే సన్యాసం తీసుకుంటానని చెప్పి తోక ముడిచి మాట తప్పిన వ్యక్తి రేవంత్ రెడ్డి. ఆరు గ్యారెంటీలను డిసెంబర్ 9 కల్లా అమలు చేస్తామని చెప్పి మాట తప్పింది కాంగ్రెస్ పార్టీ. ఇచ్చిన మాట తప్పడం, పూటకో పార్టీ మారడం మీ నైజం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తే పార్టీ రద్దు చేసుకుంటరా అని తొండి మాటలు మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియాగాంధీ లేఖ రాశారు.

## మళ్లీ గెలుపు నాదే.. కామారెడ్డిలో ఓడిపోయినట్టే కేసీఆర్ వ్యాఖ్యలుంటాయి.. కిషన్‌రెడ్డి కౌంటర్..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఏప్రిల్ 24:** ఓ టీవీ ఛానెల్ లైవ్ షో లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యల చుట్టూ తెలంగాణలో రాజకీయ దుమారం రేగుతోంది. కేసీఆర్‌కి బీజేపీ, కాంగ్రెస్ నుంచి కౌంటర్లు పడుతున్నాయి. కేసీఆర్ వ్యాఖ్యలపై ప్రత్యర్థి పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. అయితే, బీజేపీ గెలిచే సీట్లపై కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేయగా.. బీజేపీ తెలంగాణ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదన్న కేసీఆర్ ఆ పార్టీ అభ్యర్థులు ఎవరూ గెలవరంటూ కామెంట్ చేశారు. ఓ రకంగా చెప్పాలంటే ప్రత్యేకంగా కిషన్‌రెడ్డినే ఆయన టార్గెట్ చేశారు. సికింద్రాబాద్ ఎంపీ సీటును బీజేపీ గెలవదని.. బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీంతో కేసీఆర్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి రియాక్ట్ అయ్యారు. సికింద్రాబాద్‌లో బీజేపీ గెలవదన్న కేసీఆర్ వ్యాఖ్యలకు కిషన్‌రెడ్డి కౌంటర్ ఇస్తూ.. కామారెడ్డిలో ఫలితాన్ని గుర్తు చేసుకోవాలని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అలా మాట్లాడటంలో ఆశ్చర్యం లేదని.. పద్మారావు గౌడ్ ఎంపీగా కాదు.. ఎమ్మెల్యేగా గెలిచారని.. ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పబోయి.. ఎంపీగా గెలిచారని చెప్పినట్టున్నారంటూ విమర్శించారు. సికింద్రాబాద్‌లో ఈసారి కూడా గెలుపు తనదే అంటూ కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు.


## తెలంగాణలో ఇంటర్ ఫలితాలు వెల్లడి..




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఏప్రిల్ 24:** తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఇంటర్ ఫలితాలను వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్స్‌కు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. కాగా.. . ఫస్టియర్‌లో 60.01 శాతం, సెకండియర్‌లో 64.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4.78 లక్షల విద్యార్థులు హాజరుకాగా.. 2.87 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు మొత్తం 5.02 లక్షల మంది హజరవగా.. 3.22 లక్షల మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలుర కంటే బాలికలదే పైచేయిగా ఉంది. బాలికల కేటగిరీలో ఫస్టియర్‌లో 68.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. బాలుర కేటగిరీలో కేవలం 51.5 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బాలికల కేటగిరీలో 72.53 శాతం మంది ఉత్తీర్ణులు కాగా.. బాలుర కేటగిరీలో 56.1 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు

## మాధవీలత వచ్చాక ఒవైసీ కనిపించకుండా పోయారు...

### కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , ఏప్రిల్ 24: హైదరాబాద్ లోక్ సభ స్థానం నుంచి బీజేపీ తరఫున మాధవీలత బరిలోకి దిగినప్పటి నుంచి మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కనిపించకుండా పోయారని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్ లోక్ సభ పరిధిలో పార్టీ అభ్యర్థి మాధవీలత తరఫున ఆయన రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని ప్రతి గల్లీ మాధవీలత గెలుపు కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తోందన్నారు. పాతబస్తీలో 40 ఏళ్ల జంగిల్ రాజ్ నుంచి తమను విముక్తం చేయడానికి మాధవీలత, కమలం వచ్చాయని భావిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో కమలం వికసిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని... ఇలాంటి పరిస్థితుల్లో ఏ దేశమైనా బలంగా ఉండాలని పేర్కొన్నారు. గత పదేళ్ల మోదీ హయాంలో మన దేశం శక్తిమంతమైందని... మరింత సుసంపన్నంగా మారిందన్నారు. మరోవైపు రాహుల్ గాంధీ దేశాన్ని నిర్వీర్యం చేసేవిధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అంతకుముందు 60 ఏళ్ల పాటు కాంగ్రెస్ కులం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేసిందని ఆరోపించారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, ఏప్రిల్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉన్న సానుకూలతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ను బలపరిచాయి. దీంతో, బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 114 పాయింట్లు లాభపడి 73,852కి పెరిగింది. నిఫ్టీ 34 పాయింట్లు పెరిగి 22,402 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:జేఎస్ డబ్ల్యూ స్టీల్ (3.72%), టాటా స్టీల్ (2.73%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (1.75%), కోటక్ బ్యాంక్ (1.64%), అల్ట్రాటెక్ సిమెంట్ (1.48%). టాప్ లూజర్స్:టెక్ మహీంద్రా (-1.17%), టీసీఎస్ (-1.11%), మారుతి (-0.72%), ఇన్ఫోసిస్ (-0.68%), రిలయన్స్ (-0.61%).





# ఫ్యూచర్ సిటీ ఇలా ఉంటుంది.. రోబోలకు నివాసం..

## మనుషులపై ప్రయోగం.. ఎక్కడంటే.

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** భవిష్యత్తు సంగ్రహావలోకనాన్ని చూడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. భవిష్యత్తులో మన ప్రపంచం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మనం ఏ కొత్త విషయాలను భవిష్యత్ లో చూడబోతున్నాం? అంటే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాలా కష్టం. అయితే కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ నిర్మిస్తున్న ఈ నగర నిర్మాణం గురించి ప్రస్తుతం ఓ రేంజ్ లో చర్చ జరుగుతుంది. ఈ నగరంలో రోబోలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని.. ప్రయోగాల కోసం మనుషులను ఉపయోగిస్తాయని పేర్కొంది. ఆ సిటీ కోసం వోవెన్ సిటీ. ఇది భవిష్యత్ నగరం. జపాన్ కార్ కంపెనీ టయోటా ఈ నగరాన్ని నిర్మిస్తోంది. ఈ నగరం మౌంట్ ఫుజి నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో నిర్మించబడుతుంది. దీని నిర్మాణ పనులు 2021 నుంచి కొనసాగుతున్నాయి. ఈ భవిష్యత్ నగరంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సుల సంగమంగా ఉంటుంది. తొలుత 200 మంది ఇక్కడ స్థిరపడతారు. భవిష్యత్తులో దీనిని 2,000 మందికి పెంచనున్నారు.



**నగరం ల్యాబ్‌గా పని చేస్తుంది**

ది సన్ నివేదిక ప్రకారం నిజానికి వోవెన్ సిటీ ఒక రకమైన ల్యాబ్‌గా పనిచేస్తుంది. దీనిలో టయోటా దాని పునరుత్పాదక, శక్తి సామర్థ్య స్వీయ-డ్రైవింగ్ కార్లను పరీక్షిస్తుంది. ఈ కార్లకు 'ఈ-పాలెట్స్' అని పేరు పెట్టారు. అంతేకాదు ఈ నగరంలో అన్ని పనులూ రోబోటిక్స్ సహాయంతో పూర్తవుతాయి. అయితే ఇక్కడ మానవుల ఉపయోగం ఏమిటి? వారు ల్యాబ్‌లో ఎలా భాగం అవుతారంటే..

**ఫ్యూచర్ సిటీకి ఎంత ఖర్చు**
**అవుతుందంటే**

నివేదిక ప్రకారం వోవ్ సిటీ నిర్మాణం కోసం 8 బిలియన్ పౌండ్ల (అంటే సుమారు 83 వేల కోట్లు) బడ్జెట్ ఉంచబడింది. నగరంలో ప్రజలు హైడ్రోజన్‌తో నడిచే స్మార్ట్ హోమ్‌లలో నివసిస్తారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం వల్ల నగరాన్ని పర్యావరణహితంగా మారుస్తామన్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్య సంబంధిత సమస్యలపై నిఘా ఉంచేందుకు టెక్ అందుబాటులో ఉంటుంది.

# ఆత్మ విశ్వాసమే ఆమె ఆయుధం...

## చేతులు లేకపోయినా కాళ్లతో యువతి డ్రైవింగ్ ..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** శరీరంలోని ప్రతి భాగం మానవులకు ముఖ్యమైనది. కళ్లు, కాళ్లు, చేతులు ఇలా ఏ అవయవం లేక పోయినా చాలా ఇబ్బంది పడతారు. ప్రమాదం వల్లనో, ఏదైనా వ్యాధి వల్లనో కొందరు శరీరంలోని కొన్ని భాగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ధైర్యం కోల్పోకుండా మరింత స్ఫూర్తితో జీవితాన్ని కొనసాగిస్తారు. ముందు లాగానే తమ జీవితం సాగేలా కృషి, పట్టుదలతో జీవితంలో ముందుకు వెళ్తారు. అలాంటి ఒక అమ్మాయి ఈ రోజుల్లో వార్తల్లో ఉంది. ఆ యువతికి రెండు చేతుల్లేవు..అయితే తనను చూసి ప్రపంచమే ఆశ్చర్యపోయేలా చేస్తుంది. ఈ అమ్మాయి పేరు జిలుమోల్ మారియెట్ థామస్. ఆమె కేరళ నివాసి. మరియెట్ చేతులు లేకపోయినా కారు నడపగలదని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. దీని కోసం ఆమె తన పాదాలను ఉపయోగిస్తుంది.



ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆమె డ్రైవింగ్ లైసెన్స్ ను కూడా సొంతం చేసుకుంది. ఎవరైనా తన పాదాలతో కారు నడపగలరని కారు నడపడానికి వీలుగా ప్రభుత్వం అందించే డ్రైవింగ్ లైసెన్స్ ను కలిగి ఉంది. ఈ విషయాన్నీ ఎప్పుడైనా ఆలోచించి ఉంటారా.. మారియట్ కి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ఆ యువతి తన పాదాలతో కారు నడుపుతున్నట్లు కనిపిస్తుంది. తన రెండు కాళ్లను బాగా ఉపయోగించి కారు నడపడం నేర్చుకుంది. కాళ్లతో కారు గేర్ కూడా మారుస్తుంది.

# దేశంలో అల్లర్లు చెలరేగితే ప్రధానిదే బాధ్యత : మోదీ వ్యాఖ్యలపై భగ్గుమన్న ఓవైసీ


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, ఏప్రిల్ 24:** ప్రధాని నరేంద్ర మోదీ ముస్లింలపై విద్వేష ప్రచారం సాగిస్తున్నారని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలతో దేశంలో అల్లర్లు చెలరేగితే అందుకు ప్రధాని బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రధాని తరచూ మోదీ గ్యారంటీ అంటున్నారని, మోదీ గ్యారంటీ అంటే ముస్లింలపై విద్వేషం వెదజల్లడమేనని ఓవైసీ పేర్కొన్నారు. 2002 నుంచి మోదీ ఇలాగే వ్యవహరిస్తున్నారని ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఓవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. 17 కోట్ల మంది ముస్లిం జనాభాతో దేశంలో అత్యధిక మైనారిటీ కమ్యూనిటీగా ముస్లింలు ఉన్నారని ఆయన గుర్తుచేశారు. దేశంలో 140 కోట్ల మందికి మోదీ ప్రధాన మంత్రని..ముస్లింల మనోభావాలను ఇలా గాయపరచడం ప్రధాని



స్థాయి వ్యక్తికి తగదని అన్నారు. దేశంలో రేపు అల్లర్లు చెలరేగితే అందుకు నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ సంపదను అధిక సంతానం కలిగిన వారికి పంచేస్తారని మోదీ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో ఓవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఓబీసీ కోటాకు కాంగ్రెస్ తూట్లు : మోదీ వార్నింగ్

**ఇయ్యాల్టి న్యూస్, మధ్యప్రదేశ్, ఏప్రిల్ 24:** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రోజుకో అంశంతో ఆ పార్టీని ఇరకాటంలో పెడుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని బెతుల్‌లో బుధవారం జరిగిన ర్యాలీలో ఓబీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ తీరును మోదీ దుయ్యబట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో ఏపీలో ఆ పార్టీ తొలుత మత ప్రాతిపదికన రిజర్వేషన్ ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అప్పట్లో కాంగ్రెస్ తన ప్రయత్నాల్లో పూర్తిగా విజయవంతం కాలేదని అన్నారు. మళ్లీ అదే గేమ్‌ను మరోసారి ప్రయోగించాలని కాంగ్రెస్ కోరుకుంటోందని చెప్పారు. ఓబీసీ కోటా కింద కర్నాటకలో ఓబీసీలు పొందే రిజర్వేషన్ కోటాకు కత్తెర వేసేందుకు ముస్లింలందరినీ ఓబీసీ



కోటాలో చేర్చిందని వివరించారు. కాంగ్రెస్ చేపట్టిన ఈ చర్య దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలకు హెచ్చరిక సంకేతం వంటిదని ప్రధాని పేర్కొన్నారు. ఇక అంతకుముందు రాష్ట్రంలోని సాగర్‌లో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ వారసత్వ పన్నును తెరపైకి తీసుకువస్తోందని విమర్శించారు. తల్లితండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించే ఆస్తిపై పన్ను విధించాలని ఆ పార్టీ సలహాదారు సూచించారని చెప్పారు.

# ఈవీ దిగ్గజం కొలువుల కోత ... ఆరు వేల మందిపై టెస్లా వేటు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఆర్థిక మాంద్యం భయాందోళనల నేపథ్యంలో ఖర్చు తగ్గింపులో భాగంగా చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని సంస్థలూ ఎడాపెడా ఉద్యోగులను పీకిపారేస్తున్నాయి. విడతలవారీగా సంస్థలోని ఉద్యోగులను ఇంటికి సాగనంపుతున్నాయి. తాజాగా గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం టెస్లా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. టెక్సాస్, కాలిఫోర్నియాలోని సుమారు 6,020 మంది ఉద్యోగులను తొలగించాలని సంస్థ యోచిస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. వాహన విక్రయాలు తగ్గుముఖం పడుతుండటం, ఎలక్ట్రిక్ వాహనాలకు మార్కెట్‌లో పెరిగిన పోటీ కారణంగా కంపెనీపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు




పేర్కొంది. జూన్ 14 నుంచి కాలిఫోర్నియాలో 3,332 మంది ఉద్యోగులను, టెక్సాస్‌లో 2,688 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు రాయిటర్స్ నివేదించింది. యూఎస్ కార్మిక చట్టాలకు అనుగుణంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# మూడోసారి అంతరిక్షంలోకి.. సిద్ధమవుతోన్న సునీతా విలియమ్స్

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ (సునీతా విలియమ్స్) మూడోసారి అంతరిక్షయానం సిద్ధం చేస్తున్నారు. ఈసారి ఆమెతో పాటు మరో ఆస్ట్రోనాట్ బ్యాచ్ విల్మోర్ కూడా వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఒక వారం పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లో ఉండనుంది. ఈమెరకు నాసా ప్రకటించింది. ఇక వారిద్దరూ బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. నాసా వాణిజ్య కార్యక్రమంలో భాగంగా స్టార్‌లైనర్ వ్యోమనౌకలో నిర్వహిస్తున్న మొదటి మానవ సహిత మిషన్ ఇది. నిర్మాణభాగంగా స్టార్‌లైనర్ సామర్థ్యాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ



పర్యటన విజయవంతమైతే.. అంతరిక్ష కేంద్రానికి సిబ్బందితో కూడిన మిషన్ల కోసం స్టార్‌లైనర్‌ను సర్టిఫై చేసే ప్రక్రియను నాసా ప్రారంభిస్తుంది. షెడ్యూల్ ప్రకారం.. మే 6న ఈ లాంచింగ్ జరగనుంది. కల్పనాచావ్లా తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతికి చెందిన రెండో మహిళగా సునీత విలియమ్స్ ఖ్యాతి గడించిన విషయం తెలిసిందే. సునీత తొలి పర్యటన.. 2006 డిసెంబర్ నుంచి 2007 జూన్ వరకు సాగింది. అప్పుడు 29 గంటల 17 నిమిషాల పాటు నాలుగుసార్లు స్పేస్‌వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా రికార్డు సృష్టించారు. తర్వాత 2012లో నాలుగు నెలల పాటు ఐఎస్ఎస్‌లో పరిశోధనలు జరిగాయి.

# మరోసారి బహిరంగ క్షమాపణలు చెప్పిన పతంజలి.. రెండు రోజుల్లో రెండోసారి

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించిన కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకులు బాబా రాందేవ్ , సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణ మరోసారి వార్తా పత్రికల్లో బహిరంగ క్షమాపణలు చెప్పారు. వీరు పత్రికల్లో క్షమాపణలు చెప్పడం రెండు రోజుల్లో ఇది రెండోసారి. కొవిడ్ వ్యాక్సినేషన్, ఆధునిక వైద్యాన్ని కించపరుస్తూ పతంజలి సంస్థ గతంలో ఇచ్చిన యాడ్స్ విషయంలో సుప్రీంకోర్టు లో కేసు విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణపై కోర్టు ఆగ్రహం కూడా వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రాందేవ్ సారీ చెప్పారు. పత్రికల్లో క్షమాపణల యాడ్స్ కూడా ప్రచురించినట్లు వెల్లడించారు. క్షమాపణలు చెబుతూ 67 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చినట్లు పతంజలి సంస్థ కోర్టుకు తెలిపింది. అయితే ఆ క్షమాపణల యాడ్స్ సైజు విషయంలో




కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుదోవ పట్టించే యాడ్‌ల సైజ్‌లోనే, అదే ఫాంట్‌లో క్షమాపణల ప్రకటనలు ఇచ్చారా? అని ప్రశ్నించింది. దీంతో తాజాగా బుధవారం మరోసారి వార్తా పత్రికల్లో పెద్ద సైజులో బహిరంగ క్షమాపణలు తెలిపింది.

# సంపద పంచుతారంటూ మోదీ ఆరోపణలు.. రాహుల్ క్లారిటీ

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , ఏప్రిల్ 24:** లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో 'దేశవ్యాప్తంగా సామాజిక-ఆర్థిక సర్వే' హామీ రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' కాంగ్రెస్' చెబుతోందంటూ ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో ఈ అంశం తీవ్ర వివాదస్పదమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరూపించూ తమ హామీపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో జరిగిన పార్టీ సామాజిక న్యాయ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ ఈ వివాదాన్ని ప్రస్తావించారు. "ఈ సర్వే అనంతరం చర్యలు తీసుకుంటామని మేం చెప్పలేదు. కేవలం ఈ దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందనేది తెలుసుకునేందుకే సర్వే అంటున్నాం. అన్యాయం గురించి నేను మాట్లాడగానే ప్రధాని మోదీ ఎలా



స్పందించారో చూడండి. దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నామంటూ మాపై నిందలు వేస్తున్నారు. కానీ ఈ సర్వేతో అసలు సమస్య ఏంటో, ఎక్కడుందో అర్థమవుతుంది. దేశభక్తులం అని చెప్పుకొనేవారు.. సామాజిక-ఆర్థిక సర్వేతో కూడిన కులగణనకు భయపడుతున్నారు" అని రాహుల్ దుయ్యబట్టారు.

# టేకాఫ్ సమయంలో ఊడిన బోయింగ్ విమానం టైరు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, ఏప్రిల్ 24:** టేకాఫ్ సమయంలో విమానం టైరు ఊడిపోవడంతో ఓ బోయింగ్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయవలసి వచ్చింది. ఈ దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లోని ఓఆర్ టాంబో అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. దీంతో బోయింగ్‌పై మరోసారి విమర్శలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ నెటిజన్ షేర్ చేసిన వీడియోలో విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే రన్‌వేపై ల్యాండ్ అయిన విమానం టైరు నుంచి పొగ రావడం కనిపించింది. కుడి వైపు వింగ్ పాక్షికంగా దెబ్బతిన్నట్లు వీడియోలో రికార్డ్



అయ్యింది."ఫ్లైట్ టేకాఫ్ సమయంలో చక్రంలైట్ దెబ్బతిన్న అది సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు" అని దక్షిణాఫ్రికా విమానయాన సంస్థ ప్రదర్శించింది. ఎయిర్‌లైన్స్ ప్రతినిధి మాట్లాడుతూ సిబ్బంది ఈ విషయాన్ని గమనించి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలు చేరుకోవడానికి వారికోసం మరో విమానాన్ని ఏర్పాటుచేశామన్నారు.

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/



## ధనుష్ కుబేరలో నాగార్జున పాత్ర ఇదేనట..!



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: టాలీవుడ్ డైరెక్టర్ శేఖర్‌కమ్ముల కంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు బాగానే ఉంటాయని తెలిసిందే. ఈ సారి ఏకంగా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ సినిమా చేస్తుండటంతో సూపర్ క్యూరియాసిటీ నెలకొంది. వర్కింగ్ టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీకి ఇటీవలే కుబేర టైటిల్‌ను ఫైనల్ చేశారని తెలిసిందే. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ లాంచ్ చేసిన కుబేర ఫస్ట్ లుక్ ఇప్పటికే అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. ధనుష్ చెదిరిన వెంట్రుకలు, మాసిన గడ్డంతో నవ్వుతూ కనిపిస్తుండగాజ. బ్యాక్ డ్రాప్‌లో శివపార్వతుల ఫొటో ఉన్న లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా కుబేరలో రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిసిందే. తాజాగా నాగ్ పోషిస్తున్న పాత్ర ఇదేనంటూ ఓ వార్త తెరపైకి వచ్చింది. ఈ చిత్రంలో నాగార్జున పోలీసాఫీసర్‌గా కనిపించబోతున్నాడట. నాగార్జున ఈ సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చేందుకు కసరత్తులు చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పీ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. కుబేర సోషల్ డ్రామా నేపథ్యంలో రాబోతున్నట్టు తెలుస్తోంది. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## మెరుపుల చీర, మైమరిపించే అందాలతో .. మెగా కోడలు అందాల విందు...!



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: టాలీవుడ్ క్యూట్ బ్యూటీ.. మెగా ఫ్యామిలీ రెండో కోడలు లావణ్య త్రిపాఠి గురించి తెలుగు సినీ ప్రియులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అద్భుతమైన అందాలు కల్గిన ఈమె తాజాగా అదిరిపోయే చీర కట్టుకుని వయ్యారాలు ఒలకబోసింది.

## పుష్ప 2 ఫస్ట్ సింగల్ ప్రోమో వచ్చేసింది..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పుష్ప 2 సినిమా ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. ఇటీవలే ఈ మూవీ టీజర్ ని ఆడియన్స్ ముందుకు తీసుకు వచ్చిన మేకర్స్.. ఇప్పుడు మొదటి సాంగ్ ప్రోమోని రిలీజ్ చేసారు. దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకత్వంలో మొదటి భాగం సాంగ్స్ ఎంతటి హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీంతో సెకండ్ పార్ట్ సాంగ్స్ పై భారీ క్రేజ్ ఏర్పడింది. ఇక ఇప్పుడు రిలీజ్ చేసిన మొదటి సాంగ్ ప్రోమో ఆ హైప్ ని అందుకునేలా కనిపిస్తుంది. పుష్ప పుష్ప అంటూ సాగే ఈ పాటకి చంద్రబోస్ లిరిక్స్ అందించారు. ఇక ఈ ఫుల్ లిరికల్ సాంగ్ ని మే 1న ఉదయం 11:07 ని.లకు రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. మరి ఇప్పుడు రిలీజ్ చేసిన ఆ ప్రోమోని మీరు కూడా వినేయండి. కాగా... పుష్ప 1 సాంగ్స్ లో దేవిశ్రీ అండ్ సుకుమార్ ఓ పాటర్న్ ఫాలో అయ్యారు. మూవీలో ఐదు సాంగ్స్ ఉండగా.. వాటిని అన్నిటిని రచయిత చంద్రబోస్ తోనే రాయించారు. అలాగే తమిళ్, హిందీ, మలయాళ, కన్నడ వెర్షన్ సాంగ్స్ ని కూడా ఆయా భాషల్లోని సింగల్ రచయితతోనే మొత్తం సాంగ్స్ రాయించారు. ఇప్పుడు సెకండ్ పార్ట్ లోని మొదటి సాంగ్ కి కూడా చంద్రబోస్ లిరిక్స్ రాసారు. చూస్తుంటే ఈ మూవీలోని సాంగ్స్ కి కూడా చంద్రబోసే రాస్తున్నట్లు తెలుస్తుంది.




## స్లీవ్‌లెస్ బ్లౌజు, సన్నని చీర.. సంపెంగలాంటి అందాలతో శివాత్మిక రచ్చ..!




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: సీనియర్ హీరోహీరోయిన్లు అయిన జీవితా రాజశేఖర్, రాజశేఖర్ ల ముద్దుల కూతురు శివాత్మిక గురించి తెలుగు సినీ ప్రియులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అద్భుతమైన అందాలు కల్గిన ఈమె అదిరిపోయే చీర కట్టుతో రచ్చ చేసింది.





## ప్రియుడితో ఏడడుగులు వేసేసిన మలయాళ భామ.. ఫోటోలు వైరల్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: ఈ ఇయర్ ఫిలిం ఇండస్ట్రీలో పెళ్లి వార్తలు కొంచెం ఎక్కువగానే వినిపిస్తున్నాయి. ఒక స్టార్ తరువాత మరో స్టార్ పెళ్లిపీటలు ఎక్కుతూ కొత్త జీవితాన్ని స్టార్ట్ చేస్తున్నారు. ఈక్రమంలోనే తాజాగా మలయాళ భామ కూడా మూడు ముళ్ళు వేయించుకొని న్యూ లైఫ్ స్టార్ట్ చేసారు. బీస్ట్, దాదా వంటి సినిమాల్లో నటించి ఆడియన్స్ లో మంచి గుర్తింపుని సంపాదించుకున్న అపర్ణ దాస్ ప్రియుడితో ఏడడుగులు వేసేసారు. ఇటీవల బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న మలయాళ మూవీ 'మంజుమ్మల్ బాయ్స్'లో నటించిన దీపక్ పరంబోల్‌తో అపర్ణ గత కొంత కాలంగా ప్రేమాయణం నడుపుతూ వస్తున్నారు. ఇప్పుడు ఆ లవ్ జర్నీని మ్యారేజ్ జర్నీగా మార్చుతూ ముందుకు తీసుకు వెళ్తున్నారు. ఈ బుధవారం ఓ గుడిలో సంప్రదాయ పద్ధతిలో చాలా సింపుల్ గా పెళ్లిని చేసుకున్నారు. అయితే హల్దీ, సంగీత్ వంటి ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ని మాత్రం గ్రాండ్ గానే జరుపుకున్నారు. ఇక ఈ వేడుకలకు సంబంధించిన ఫోటోలను, వీడియోలను అపర్ణ తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. మీ ఆశీర్వాదాలు కావాలంటూ ఆడియన్స్ ని కోరుతున్నారు. ఇక ఈ పోస్టులు చూసిన ఆడియన్స్.. కొత్త జంటకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే అపర్ణ ఫ్యాన్స్ మాత్రం తెగ ఫీల్ అయ్యిపోతున్నారు.



## చిలిపి నవ్వుతో ...మెస్మరైజ్ చేస్తున్న స్రవంతి చొక్కరపు..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24: తెలుగు యాంకర్ స్రవంతి చొక్కరపు తన కొత్త ఫోటోషూట్ లో చిలిపి నవ్వు లుక్స్ తో అందర్నీ మెస్మరైజ్ చేస్తోంది...

## బిగ్‌బాస్ ఫేమ్ శ్వేత వర్మకు అసభ్యకరమైన మెసేజులు.. అమ్మకు ఇలాగే చెబితే ఓకేనా ?.. అంటూ..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, ఏప్రిల్ 24:** బుల్లితెరపై అతిపెద్ద రియాల్టీ షో బిగ్ బాస్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్నవారు చాలా మంది ఉన్నారు. అందులో శ్వేత వర్మ ఒకరు. తెలుగులో చాలా సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. అలాగే కొన్ని సినిమాల్లో హీరోయిన్ గానూ కనిపించింది. కానీ నటిగా కాకుండా బిగ్ బాస్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఈ షోలో తనదైన ఆట తీరుతో ఆకట్టుకుంది. బిగ్ బాస్ తర్వాత పలు చిన్న చిన్న సినిమాల్లో కనిపించింది. ఇక కొన్నాళ్లుగా అటు సినిమాలకు కూడా దూరంగానే ఉంటుంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది శ్వేత. ఈ క్రమంలోనే ఇటీవల ఆమె చేసిన ఓ పోస్టుకు ఓ వ్యక్తి అసభ్యకరమైన మెసేజులు చేశాడు. దీంతో చాలా సీరియస్ గానే రియాక్ట్ అయ్యింది శ్వేత. అసభ్యంగా కామెంట్ చేసిన సదరు వ్యక్తి ప్రోఫైల్ ఐడీ కూడా తన ఇన్ స్టాలో షేర్ చేసింది. తాజాగా తన ఇన్ స్టా స్టోరీలో కొన్ని స్క్రీన్ షాట్స్ చేసింది శ్వేత. అందులో ఓ వ్యక్తి శ్వేత ఫోటోకు అసభ్యకరంగా కామెంట్ చేశాడు. దీంతో శ్వేత రియాక్ట్ అవుతూ.. ఒక మనిషికి ఇలాంటి మాటలు మాట్లాడాలని ఎలా అనిపిస్తుంది ?.. అతని అమ్మకు కూడా ఎవరైనా ఇలాగే చెబితే పర్వాలేదు అనుకుంటాడా ? అంటూ రాసుకొచ్చింది. అలాగే అతడి వివరాలతో కూడిన స్క్రీన్ షాట్ కూడా షేర్ చేసింది. ఇలాంటి వాళ్లను చూస్తే సిగ్గేస్తుందని.. అలాగే తనకున్న సోర్స్ ద్వారా అడ్రస్, కాంటాక్ట్ కూడా సంపాదించానని తెలిపింది. అతడిది రియల్ అకౌంటా ? ఫేక్ అకౌంటా ? అని ఆలోచన అక్కర్లేదని.. అది ఏదైనా తెచ్చిపెట్టే సోర్స్ తనకుందని తెలిపింది. అతడి అడ్రస్ కూడా పోస్ట్ చేయగలని.. కానీ మనిషిని కాబట్టి చేయలేదు అంటూ చెప్పుకొచ్చింది. అతడు ఒక గుణపాఠం నేర్చుకుంటే మంచిది .. ఇలాంటి పనులు మళ్లీ చేయకుండా ఉంటే మంచిదని చెప్పుకొచ్చింది. మరోసారి అతడి కామెంట్ పై రియాక్ట్ అవుతూ ఓ వీడియోను షేర్ చేసింది. శ్వేత వీడియోపై నెటిజన్స్ రియాక్ట్ అవుతూ ఆమెకు మద్దతు తెలుపుతున్నారు.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838